సాగులో సాంకేతిక విప్లవం

- వ్యవసాయ రంగంలో రైతులకు వెన్నుదన్నుగా డ్రోన్లు
- సమయం, డబ్బు ఆదా అవుతాయంటున్న నిపుణులు

అల్లవరం: ఆధునిక కాలంలో నానాటికి విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది. వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి కూలీల కొరతను నివారించడానికి యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. నారు వేయడం నుంచి కోత కోసే వరకూ రైతులు సైతం యాంత్రీకరణ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ దిశగానే అందుబాటులోకి తీసుకొచ్చిన డ్రోన్లతో సమయం, డబ్బు ఆదా అవుతున్నాయని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు.

వ్యవసాయ రంగంలో ఇప్పటి వరకూ దమ్ము చేయడం, నాట్లు వేయడం, హార్వెస్టింగ్, వరి పనలను ఒబ్బిడి చేయడం వంటి యాంత్రీకరణ పద్ధతులను రైతులు అవలంబిస్తున్నారు. అయితే వరిని ఆశించే తెగుళ్ల నుంచి పంటకు కాపాడుకోవాలంటే సరైన సమయంలో పురుగు మందుల స్ప్రేయింగ్ చాలా అవసరం. అయితే పిచికారీ చేసే సమయంలో రైతులు మృత్యువాత పడిన సందర్భాలు సైతం ఉన్నాయి. వీటిని అధిగమించడానికి పురుగు మందులను స్ప్రేయింగ్ చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. వరి, పత్తి, పచ్చిమిర్చి, కూరగాయలు, మొక్కజొన్న, అపరాలు, ఉద్యాన పంటలను ఆశించిన పురుగులను నివారించడానికి డ్రోన్లతో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కాలువలు, డ్రైన్లు వెంబడి పేరుకుపోయిన తూటు, గుర్రపుడెక్కలను నిర్మూలించడానికి సైతం అధికారులు వీటినే ఉపయోగిస్తున్నారు..


పైరుపై పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

అద్దెకు దొరుకుతున్న డ్రోన్లు

ఎకరం విస్తీర్ణంలో పురుగుల మందు పిచికారీ చేయడానికి కేవలం రూ.400 ఖర్చుతో రైతులకు డ్రోన్లు అద్దెకు లభిస్తున్నాయి. నానో యూరియా, నానో డీఏపీ మార్కెట్‌లోకి రావడంతో పురుగు మందులతో పాటు నానో ఎరువులను పైరుపై స్ప్రేయింగ్ చేసే విధానం సైతం అందుబాటులోకి వచ్చింది. డ్రోన్‌కు అమర్చిన సెన్సార్‌కు మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసి ఆపరేటర్ సాయంతో ఆటోమెటిక్, మాన్యువల్ విధానంలో స్ప్రేయింగ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో డ్రోన్లు ఏర్పాటుచేసేందుకు కార్యాచరణ చేపట్టింది. అల్లవరం మండలం దేవగుప్తం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు జున్నూరి రామారావు డ్రోనుని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీన్ని ఆపరేట్ చేయడానికి పీఏసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ నుంచి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సర్టిఫికెట్ తీసుకున్న డ్రోన్ పైలెట్‌ని నియమించారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



వరి, ఉద్యాన పంటలపై ఆశించిన పురుగుల నివారణకు డ్రోన్‌తో పిచికారీ విధానం వైపు మొగ్గు చూపాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. వ్యవసాయ రంగంలో డ్రోన్‌తో పిచికారీ నూతన ఒరవడి అని చెప్పాలి. ఒకే రోజున 25 నుంచి 30 ఎకరాల్లో స్ప్రేయింగ్ చేయొచ్చు. రైతులకిది భరోసాగా ఉంటుంది.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి, అల్లవరం

పది నిమిషాల్లో పిచికారీ



డ్రోన్ సాయంతో ఎకరానికి కేవలం పది నిమిషాల్లో పురుగుల మందు పిచికారీ చేయొచ్చు. రోజుకి 20 నుంచి 25 ఎకరాల్లో స్ప్రేయింగ్ చేయొచ్చు. డ్రోన్ ద్వారా మందు పైరుపై సక్రమంగా పడుతుంది. దాళ్వా సీజన్ చివర్లో సర్టిఫికేట్ రావడంతో 50 ఎకరాల్లో స్ప్రేయింగ్ చేశాను.

– శిరంగు దుర్గా నరేంద్ర, డ్రోన్ పైలెట్, దేవగుప్తం పీఏసీఎస్

క్లుప్తంగా

డ్రెయిన్ స్తంభించి దుర్గంధం


పూడిక తీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక సుబ్బారాయుడి గుడి వద్ద 216 జాతీయ రహదారి చెంత ఉన్న మున్సిపల్ డ్రెయిన్ చెత్తా చెదారంతో స్తంభించి తీవ్ర దుర్గంధంతో స్థానిక ప్రజలు అవస్థలు పడ్డారు. అక్కడి పరిస్థితి తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి తక్షణమే స్పందించి స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి తీవ్రతను పరిశీలించారు. తక్షణమే పారిశుధ్య కార్మికుల చేత డ్రెయిన్లపై ఉన్న బల్లల తొలగించి పూడికతీత పనులు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


ఠానేల్లంకలో రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

ముమ్మిడివరం: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి ఎం.హరిబాబులు కోరారు. ముమ్మిడివరం మండలం ఠానేల్లంకలో వర్షాల వల్ల నష్టపోయిన రైతులను సోమవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాలను అత్యవసర పరిస్థితులుగా భావించి కోత కోసే దళాలను, యంత్రాలను రప్పించాలన్నారు. వారి వెంట రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వి.కృష్ణయ్య, సఖిలే సూర్యనారాయణ, కారెం వెంకటేశ్వరరావు, గుడే దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం టౌన్: పలు ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సల కోసం రోగులకు రక్తం అత్యవసరం కావడంతో స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 14 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, బుద్దాల బ్లడ్ బ్యాంక్, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు యువకులు సోమవారం వెళ్లి రక్తదానం చేశారు.

రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు విద్యార్థినులు


బి.రుక్మిణి సాహిత్య


జి.శ్రీసంజనాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి.రుక్మిణి సాహిత్య, జి.శ్రీసంజనాదేవిలు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల ఎంపికకు హాజరుకానున్నారని పీడీ గొలకోటి ఫణీంద్ర సోమవారం తెలిపారు. రావులపాలెంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి తరఫున ఆడి తమ ప్రతిభ చాటారన్నారు. మే 14న రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని పీడీ తెలిపారు.

కేంద్రాల సమస్యలను పరిష్కరించండి

అల్లవరం: బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాలు, గుడ్లు సక్రమంగా పంపిణీ కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు విన్నవించారు. సోమవారం గోడిలోని ఆయన నివాసంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బేబి గంగారత్నం, విజయ, రత్నకుమారి, దయాకృప, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న రాష్ట్రపతితో సంక్షేమ పథకాల ప్రారంభం

యానాం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే నెల 6, 7 తేదీల్లో పుదుచ్చేరి పర్యటనలో భాగంగా వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రారంభించనున్నారని సీఎం రంగసామి సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ సిద్ధ మెడికల్ కాలేజీకి, ఆసుపత్రికి ఆమె శంకుస్థాపన చేస్తారని, ఏడాదికి 12 ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్‌లకు నెలకు రూ.300 చొప్పున రాయితీ ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

వైఎస్సార్ సీపీ నాయకుల వితరణ


ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా దివ్యాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్న నాయుడు పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం కామనగరువు పితానివారి పాలెం సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో అల్పాహారం అందించారు. మధ్యాహ్నం ఇమ్మిడివరప్పాడు మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, బస్టాండ్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆకుల బాలాజీ, నల్లా హేమంత్, తిక్కా బాబి, పెట్టా సత్యనారాయణ, చింతలపూడి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటిద్దు వెంకన్నాయుడు జన్మదినం సందర్భంగా పినిపే విశ్వరూప్ ఫాలోవర్స్, కువైట్ ఎన్నారై గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో దివ్యాంగులకు దుప్పట్లు, బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గంలో రూ.127 కోట్ల వ్యయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చినట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. జార్జిపేట పంచాయతీలో రూ.36 లక్షల ఓఎన్‌జీసీ నిధులతో చేపట్టిన తాగునీటి ట్యాంకు, రూ.15 లక్షల రిలయన్స్ నిధులతో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్‌లను ఎమ్మెల్యే పొన్నాడ సోమవారం ప్రారంభించారు. పి.మల్లవరం పంచాయతీలో రూ.49 లక్షల జలజీవన్‌మిషన్ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే న్యాయం జరిగిందని, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు పేర్ని ఆదినారాయణ మూర్తి, దున్నా సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఎ.వరలక్ష్మి, సూరంపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


జార్జిపేట తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పిల్లంకలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం పిల్లంక పంచాయతీలో ఆయన నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలను కలిగిన లబ్ధిని వివరించారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలకు ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మళ్లీ దీవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైఎస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కాకర్లపూడి కృష్ణంరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, పటవల సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పిల్లంకలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

శ్మశానవాటికను కాపాడాలంటూ నిరసన

యానాం: భీమ్‌నగర్ హిందూ శ్మశానవాటిక భూమిని ఎవరూ ఆక్రమించకుండా, చేపల వ్యాపారానికి షెడ్లు వేయకుండా నిరోధించాలని కోరుతూ సోమవారం భీమ్‌నగర్, వికాస్ కోలనీ, సిద్ధార్థనగర్, యూకేవీ నగర్ తదితర గ్రామాల ప్రజలు స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చేపల వ్యాపారాలను భీమ్‌నగర్ శ్మశానవాటికకు తరలించి అక్కడ రేకులు షెడ్డులు వేయడానికి ప్రయత్నించడం అన్యాయమన్నారు. తక్షణం బైపాస్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న చేపల వ్యాపారస్తుల్ని ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లోకి తరలించేలా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం దళితనేత పొనుగుమట్ల విష్ణుమూర్తి నేతృత్వంలో ఎమ్మెల్యే సమక్షంలో ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందించారు.


ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందిస్తున్న గ్రామపెద్దలు

ఎంపీపీ పరామర్శ

తాళ్లరేవు: భార్య వియోగంతో బాధపడుతున్న జార్జిపేట వేణుగోపాలస్వామి ఆలయ మాజీ చైర్మన్ కానూరి నరసింహమూర్తిని ఎంపీపీ రాయుడు సునీత దంపతులు సోమవారం పరామర్శించారు. నరసింహమూర్తి భార్య పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీపీ దంపతులు పద్మావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం, మహా పూర్ణాహుతి

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంకలో పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి వారి తీర్థ కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఆదివారం రాత్రి పలు రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. సోమవారం శాస్త్రోక్తంగా చండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత ప్రత్యేకంగా తయారుచేసిన 11 హోమగుండాల్లో హోమాలతో పాట స్వామి, అమ్మవార్లకు 11 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, పూజలు చేశారు.

భవ్యకీర్తిని సత్కరించిన ఆర్ఏఓ

యానాం: పదోతరగతిలో విశేష ప్రతిభ కనబరిచి యానాం రీజియన్ పరిధిలో ద్వితీయ స్థానం సాధించిన కాజులూరి భవ్యకీర్తిని ఆర్ఏఓ మునిస్వామి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రామవెంకట జగన్నాథరెడ్డి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


భవ్యకీర్తిని సత్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

రెండు సెంట్ల స్థలం వితరణ

అల్లవరం: సామంతకుర్రులో పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన రెండు సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన కాకిలేటి వెంకటేశ్వరరావు వితరణ చేశారు. అమలాపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో స్థలానికి చెందిన డాక్యుమెంట్లని మంత్రి విశ్వరూప్‌కు ఆయన సోమవారం అందజేశారు. 2017లో నాలుగు సెంట్ల భూమిని ఇచ్చినా కార్యాలయానికి స్థలం సరిపోకపోవడంతో తాజాగా మరో రెండు సెంట్ల స్థలాన్ని దానం చేశారు. స్థల దాత కాకిలేటి వెంకటేశ్వరరావును మంత్రి విశ్వరూప్ అభినందించారు. కార్యక్రమంలో తుని పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్ సుందరనీడి సాయిబాబు, చెదళ్ల వాసుదేవుడు, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మంత్రి విశ్వరూప్‌కి స్థలం డాక్యుమెంట్‌ను అందజేస్తున్న దాత కాకిలేటి వెంకటేశ్వరరావు

ఆర్డీఓను కలిసిన ఎమ్మెల్సీ

అమలాపురం రూరల్: సోమవారం ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో ఆర్డీఓ వసంతరాయుడును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్డీఓ వసంతరాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం మన్నా కాలనీలో ఎన్నో ఏళ్ళుగా పరిష్కారం కాని రోడ్డు సమస్యను వివరించి, పరిష్కరించాలంటూ ఆర్డీవోను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కోరారు.


ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో వంసతరాయుడు

పుస్తక పఠనంతో ఎంతో మేలు


ఉచిత శిక్షణా శిబిరం కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో సూర్యప్రకాశం తదితరులు


భీమనపల్లిలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న గ్రంథాలయ అధికారులు


గోడిలోని వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: పుస్తక పఠనం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అమలాపురం ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంఈవో సూర్యప్రకాశం సోమవారం ప్రారంభించి ప్రసంగించారు. ఉచిత శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు పిలుపునిచ్చారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిక్షణా శిబిరం లక్ష్యాలు, ప్రయోజనాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను అతిథులు విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, ఎంఆర్‌పీ ఎం.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో మే 8వ తేదీ నుంచి జూన్ 11 వరకూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారులు ఎస్.శేషుకుమార్, ఎస్.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ చిత్రలేఖనం, యోగా, పుస్తక పఠనం తదితర అంశాల్లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులకు హాజరుకానున్న విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి, అద్దంకి అమరేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

అల్లవరం: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గోడిలో గ్రంథాలయాధికారి సత్యనారాయణ అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరంలో ఉంచిన పుస్తకాలను చదవి జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎందరో మహానుభావులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను సచివాలయ కార్యదర్శి డి.సురేంద్ర, రెవెన్యూ అధికారి ఎం.స్టీవెన్‌లు ప్రారంభించారు. కథలు చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సతీష్, బి.శ్రావణి, కె.అజయ్, పాపారావు, లలిత తదితరులున్నారు.

అంగన్‌వాడీ విద్యార్థుల సంసిద్ధతా ఉత్సవం

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేటలో ఎంఎలికే నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల పాఠశాల సంసిద్ధతా ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల శారీరక అభివృద్ధి, బుద్ధికుశలత, భాషాభివృద్ధి తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల్లో లెక్కలు, అంకెలు, వివిధ రకాల బొమ్మలు, ఇంగ్లిష్ పదాల గుర్తింపు తదితర విషయాల్లో ఉన్న అవగాహనను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనళిని, ట్రైనర్ ఉష, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థుల సంసిద్ధతా ఉత్సవంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు

ఏటీఎం ఏర్పాటుకు సన్నాహాలు

రాజోలు: ఆర్టీసీ డిపో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఆవరణలో ఏటీఎం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని డిపో మేనేజర్ పి.భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఏటీఎం ఏర్పాటు చేసేందుకు ఆర్‌బీఐ గుర్తింపు పొందిన బ్యాంకుల నుంచి టెండర్లు పిలిచామన్నారు. టెండర్ ఫారాలు రాజోలు ఆర్టీసీ కార్యాలయంతో ఈ నెల 26వ తేదీ వరకు, అమలాపురం డీపీటీఓ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ వరకు విక్రయిస్తారన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను రాజోలు ఆర్టీసీ డిపో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు వేయాలన్నారు. అదే రోజు మూడు గంటలకు టెండర్ ఫారాలు టెండర్‌దారుల సమక్షములో తెరుస్తామన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్పీకర్ ఆర్.సెల్వం సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి సీఎం రంగసామికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నేతలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అమలాపురం టౌన్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గేను హత్య చేస్తానన్న కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మణికంఠ రాథోడ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అమలాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.